ఇద్దరు వెధవలు నన్ను జ్యా(వై పీక్కుతింటున్నారు. బంగాళాఖాతంలో వాయుగుండంలా వదలకుండా వున్నారు! ఒకడు పాట ప్రారంభించాడు తన ప్రేయసి కోసం.

"ముచ్చటగా నువ్వంటే
ముద్దిమ్మని నేనంటే
మృదు దక్షిణహస్తంతో
మొట్టికాయ మొట్టలేద ప్రేయసీ! నను
గట్టిగాను తిట్టలేద ప్రేయసీ!"

"ఒరేయ్ ఇక్కణ్ణుంచీ పోంరా! డబ్బాగాళ్లు డబ్బా వాయించేస్తున్నారు. నేను కథ రాసుకోవాలిరా బాబూ! నన్ను డిస్టర్బ్ చెయ్యకంరా!" అన్నాన్నేను.

"మేం.....మేం డబ్బా వాయించేమా? ఒరేయ్ పదరా పోదాం! వీడికి మహాభక్తుడైన బాబాని దర్శించే భాగ్యం లేదు. మనమేం చేస్తాం?" అన్నాడు మొదటి మిత్రుడు.

ఔను నిజమేరా! వీడికి వాడి మనస్సులో ఉన్న కోర్కెలు దైవాంశసంభూతుడైన బాబాగారి ద్వారా తీర్చుకునే అదృష్టం లేదు. దేనికైనా రాత ఉండొద్దా?" అన్నాడు రెండోవాడు.

"ఔను పదరా పోదాం జై బాబా!" అంటూ నాకు అదృష్టం కలుగుతుందనే దుష్టగ్రహాలు రెండూ నిష్క్రమించాయి.

మర్నాడు పొద్దున్నే మళ్లీ ఇద్దరూ కొట్టుకొచ్చారు.

"ఒరేయ్! బాబా ఎంత నెమ్మదస్తుడో తెలుసా? ఎంత నిస్వార్థపరుడో తెలుసా? ఒక్క పైసా కూడా ఎవరిదగ్గరా పుచ్చుకోడు. అబ్బే! ఖాతర్ చేస్తేగా? ఖాతర్‌లెస్ బాబా ఎవరంటే ఆయనే!" అన్నాడు ప్రథముడు.

"ఔన్రా! అటువంటి మహత్తుగల వ్యక్తిని ఎక్కడాకానము. నభూతో నభవిష్యతి!" అన్నాడు ద్వితీయుడు.

"ఒరేయ్! నా దగ్గర ఆ బాబాల ఊసు ఎత్తకండిరా. కోటి విద్యలు కూటికొరకే అన్నట్లు, ఎన్నో పాట్లు పడుతూ ఎన్నో ప్లాన్లు వేస్తుంటారు పొట్టకూటికి. మందులిస్తామని ఒక బాబా, పిల్లల్ని పుట్టిస్తామని ఒక సాములారు, ముక్తికి మార్గం చూపిస్తామని మర్రి ఊడల వంటి జటలు ధరించినవాడు ఒకడు ఇలాగ అనేక వేషాలేస్తుంటారు!" అని నాకిష్టం వచ్చినట్లు దూషించాను అయిష్టత వల్ల.

"ఒరేయ్ నీకిష్టం లేకపోతే పోనీగాని, మా ఎదురుగా మా బాబాని దూషిస్తే ఒప్పుకోం తెల్సా!"అన్నాడొకడు.

"నిజమేన్రా మేం సహించం!" అన్నాడు రెండోవాడు.

"సహించకపోతే దహించుకుని చావండి" అన్నా న్నేను,

అలావాళ్లని పొమ్మన్నానేగాని, నాలో రెండో ఆలోచన వచ్చింది: గుడ్డిగా ఆ బాబాని తిట్టే బదులు, ఓసారి పరీక్షిస్తే పోలా?" అనిపించింది.


మా ఫ్రెండ్సిద్దర్నీ రమ్మని కబురు చేశాను. వచ్చారు.

"మీబాబానోసారి దర్శించుకోవాలనుందిరా" అన్నాను.

నాలో వొచ్చిన మార్పుకి వాళ్లు పొంగిపోయారు.

ముగ్గురమూ బయలుదేరాము. అరటిపళ్లూ కొబ్బరికాయలూ పట్టుకుని. ఆ బాబా ఆశ్రమం ఓ చిన్న కొండమీద వుంది. కొండదగ్గర కొచ్చాం. ఎక్కాం.

మాకు ఎదురొస్తున్నాడు బాబా అంతరంగిక ప్రియశిష్యుడొకడు. "టికెట్టు తీసుకోవాలి బాబా దర్శనం చేసుకోవాలంటే" అని అరుస్తున్నాడు.



# బంకమట్టి

బులుసు - జి. ప్రకాష్

"ఎంత బాబూ టిక్కెట్టూ" అడిగాను.

"పది రూపాయలు మాత్రమే ఓన్లీ టెన్ రుపీస్"

నేను మా ఫ్రెండ్సిద్దరి మొహాలవైపు చూశాను. కొరకొరలాడుతూ.

వాళ్లు అదోలా ఆముదం త్రాగినట్లు మొహం పెట్టారు.

"ఇక్కడ నాటకంగాని సినిమాగాని ప్రదర్శిస్తున్నారా టిక్కెట్లమ్ముతున్నారు? దర్శనానికి టిక్కెట్లేమిటయ్యా" అన్నాను.

"అదేమిటండీ అలా అంటారు? తిరుపతి కొండమీద టిక్కెట్లు కొనుక్కుని వెళ్లడం లేదు?" అన్నాడా శిష్య పరమాణువు.

"నిజమే! అక్కడ టిక్కెట్లమ్మినా, ధర్మదర్శనం కూడా వుంది కదయ్యా! ఇక్కడ మరి ఆ అవకాశం వుండొద్దా?"

"ఆశ్రమం నిర్వహించడానికి డబ్బులుండొద్దుటండీ? సిబ్బందికి భోజన భాజనాలు, కరంటు, నీరుఖర్చిచరూ. ఇవన్నీ ఊరికే వస్తాయటండీ?"

సరేవీడితో వాదనెందుకని, టిక్కెట్లు కొనుక్కొని లోనికెళ్లాం.

అక్కడో చిన్నమేడ. అందులో ఓ విశాలమైన హాలు. అందులో కుర్చీలు, సోఫాలు అనేకం. బోలెడన్ని ట్యూబ్‌లైట్లు.

ఆ విశాలమైన హాల్లో అడుగుపెట్టాం. ఆ మధ్య ఒక కుర్చీ. అందులో

పరుపులూ వున్నాయి. ఆ కుర్చీపైనే బాబాగారు కూర్చుంటారన్నమాట. ఆ హాల్లో కొన్ని వందలమంది బాబా భక్తులు వేచి ఉన్నారు. ఇంకా బాబాగారు తన పీఠం అలంకరించలేదు. అక్కడ కూర్చున్న బాబా భక్తుల్లో నూటికి తొంభైఏనిమిది మంది వర్తక ప్రముఖులే!

ఇంకేం? బాబా పంట పండింది!

కొంత సమయం గడిచేక బాబాగారు వచ్చారు. అంతా ముకుళిత హస్తాలతో లేచి నిలబడ్డారు. నేను మాత్రం ఏదో పరధ్యానంగా ఉండి లేచి నిలబడలేదు. మా ఫ్రెండ్సిద్దరూ నన్ను లేచి నిలబడమని గిల్లేరు. ఇహ బావుండదని లేచి నిలబడ్డాను.

వర్తకులంతా బాబాగారికి అరటిపళ్లు, డబ్బు, అన్నీ సమర్పించుకున్నారు, మొక్కు తీర్చుకున్నట్లు. తరువాత దేవుడి గూర్చి బాబాగార్ని ఏవేవో ప్రశ్నలు వేశారు. అతడేవేవో జవాబులు చెప్పాడు. వాళ్లకవెంతో సంతృప్తి కలిగించాయి.

ఎవరైనా ఒక వ్యక్తి మీద ఆరాధనాభావం ఏర్పడ్డప్పుడు, ఆ వ్యక్తికి వ్యతిరేకంగా ఎవరేమి చెప్పినా వినిపించుకోరు. చెవుల కడ్డంగా బిరడాలు పెట్టేసుకుంటారు. ఒకవేళ చెవిలో చెవిటి మిషనుగాని ఉంటే అది పైకి తీసేస్తారు.

మొక్కులు తీరేక ఒక్కొక్కరే వెళ్లిపోతున్నారు.

ఇంకక్కడ హాల్లో ఉన్నది మేం ముగ్గురమే. మేం బాబాగార్ని సమీపించి మా దగ్గరున్న పళ్లు వారికి సమర్పించాం.

నా ధీమా ఏంటంటే నేనిచ్చే సరుకు బాబాగారు స్వీకరించకపోతే అవేవో హాయిగా నేనే తినేద్దామని. నేను తినేసినా, నాలో ఉన్న ఈశ్వరుడికే కదా ఆ అరటిపళ్లు చేరతాయి!

కాని, కథ అడ్డం తిరిగింది! చల్లగా పుచ్చేసుకున్నారు బాబాగారు. అరటిపండు ముక్కొకటి నోట్లో పడేసుకుని, రెండో ముక్క నాకిచ్చారు బాబాగారు.

ఇంతలో ఎవరో ఓ శిష్యుడు లోపల్నుంచి వచ్చి కొబ్బరికాయలు పట్టుకు పోయాడు. మేమంతా తెల్లబోయాం!

ఆ కొబ్బరికాయలే బయటనున్న కొబ్బరికాయల కొట్టులోకి వెళతాయన్నమాట. రొటేషన్ చక్రవర్తి!

"చూడండబ్బాయిలూ! మీ దగ్గరున్న డబ్బులో కొంత ఇందులో పడేయండి" అంటూ హుండీ చూపించారు బాబాగారు.

ఎందుకు? అన్నట్లు అతని మొహంలోకి చూశాను.

"మరేంలేదు. మీరు మంచి వయస్సులో ఉన్నారు. డబ్బుని వృథాచేసి అపరిచిత స్త్రీలతో శారీరక సంబంధాలు పెట్టుకుంటే ఎయిడ్స్ వ్యాధి వస్తుంది. అప్పుడు మీ ఎయిడ్‌కి ఎవ్వరూ రారు!" అన్నారు బాబాగారు.

నేను ఆశ్చర్యపోయాను!

బాబాగారికి ఎయిడ్స్ గురించి ఇంత అవగాహన ఎలా వచ్చింది? ఈయనేదో ముక్కు మూసుకుని జపం చేసుకుంటూ, అప్పుడప్పుడు ధార్మికోపన్యాసాలు ఇస్తున్నాడనుకుంటున్నాను. కొంపతీసి ఈయన ఎయిడ్స్ పేషెంట్ కాడు కదా?

అతనన్నట్లు డబ్బుని ఆయన హుండీలో పడేస్తే, ఆయన జేబులు నిండుతాయి గాని, ప్రజలకెలా మేలు జరుగుతుందట? ఈ సందేహాన్నే వెలిబుచ్చాను బాబాగారి వద్ద.

"ఏం? తిరుపతి కొండ మీద స్వామివారి హుండీలో పడేసిన డబ్బు ధార్మిక కార్యక్రమాలకి, శిధిల దేవాలయాల పునరుద్ధరణకి వినియోగించడం లేదా? అందులో పడేసిన దొంగ డబ్బు పునీతం అవడం లేదా?" ఎదురుదెబ్బ తీశారు బాబాగారు "అలాగే నేను నిర్మించే ఆశ్రమానికి భక్తులిచ్చే డబ్బుతో స్థలం సేకరించాను. ఆశ్రమం కట్టేక భక్త జనానకి భోజనం వసతి ఏర్పాటు చేస్తాను".

అతనన్నది అబద్ధమని నా ఉద్దేశ్యం కాదు. అతని ఉపమానంలో పోలిక లేదు. కొండంత దేవుడితో ఈయనకు సామ్యమా?

మా స్నేహితులిద్దరూ తమ జేబులో ఉన్న డబ్బు పడేశారు బాబాగారి హుండీలో. నాకు మాత్రం ఆయన హుండీలో డబ్బు పడేయడానికి ప్రాణం ఒప్పలేదు.

అంతా బయటకి వచ్చేశాం.

"ఓరి! ఎంత పని చేశార్రా? వాడిలాగే డబ్బు కూడబెట్టి రాత్రికి రాత్రే ఉడాయించేస్తే?" అన్నాన్నేను.

"నా కా భయం లేదు" అన్నాడు మొదటివాడు.

"డిట్టో" అన్నాడు రెండోవాడు.

నేనెంత చెప్పినా వీళ్లు వినే ఘటాలు కారు.

"మనం ఇచ్చిన అరటిపళ్లు బాబాగారు పుచ్చేసుకున్నారే!" అన్నాన్నేను, మా వాళ్లని ఏడిపిద్దామని.

"ఓరి చచ్చు దద్దమ్మా! ఆ మాత్రం తెలీదూ? బాబాగారు సాధారణంగా ఎవరి అరటిపళ్లూ కొబ్బరికాయలూ పుచ్చుకోరు. ఎవరివి పుచ్చుకుంటే వాళ్లు ధన్యాత్ములని తెలుసుకో" అన్నాడు మొదటివాడు.

"ఈ మాత్రం కీలకం తెలియని మొద్దు వెధవని నిన్నొక్కణ్ణే చూశాం" అన్నాడు రెండోవాడు.

మరి ఈ బంకమట్టి బుర్రలతో ఎంత వాదించినా లాభంలేదని ఊరుకున్నాను.

ఇంటికి వచ్చేశాం.

మర్నాడు పొద్దునే మొహం కడుగుదామని వీధి అరుగుమీదికు వచ్చాను. మా ఫ్రెండ్సిద్దరూ కనబడ్డారు.

"ఏమర్రా! ఏమిటి సంగతి?" అన్నాను.

"ఏమీ లేదు! ఏమీ లేదు" అంటూ వెళ్లిపోయారు.

బ్రష్ చేసుకున్నాక కాఫీ తాగుదామని క్లబ్బుకి బయలుదేరాను. వీధి మలుపు తిరిగేనో లేదో రెండు ఆడగొంతుకలు వినిపించాయి.

"విన్నావే రాధా! ముండా బాబా, లలితకి పిల్లలు పుట్టడానికి మందులిస్తానని దానికి నెలతప్పించేశాట్ట!"

"అదొకటేనా? మొత్తం అతని హుండీ కలక్షన్ లక్షట! అక్షరాలా ఒక లక్ష మాత్రమే! ఎక్కడికో ఉడాయించేశాట్ట!

## వెలుగు తగ్గిన 'ప్రకాశ్'రాజ్



'అంతఃపురం' చిత్రంతో ప్రకాశ్‌రాజ్ కెరీర్ ఆకాశాన్నంటింది. కానీ అదే చిత్రాన్ని తమిళంలో తీస్తే ఫెయిలైంది. ఇంతలో ఎస్వీకృష్ణారెడ్డి చిత్రాలు రెండింటితో ప్రకాశ్‌రాజ్ కెరీర్ మళ్లీ బాగుందనుకున్నారు. 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' చిత్రంతో కాస్త పేరు సంపాదించాడు. అతనితో సినిమాలు తీయాలనుకుంటున్న నిర్మాతలు అతని సొంతచిత్రం 'మహారాణి' ఫ్లాప్ కావడంతో అతనినుంచి తమ దృష్టిని మరల్చుకున్నారు. ఒకప్పుడు ఇరవైలక్షలదాకా డిమాండు చేసిన ప్రకాశ్‌రాజ్ అటు తమిళచిత్రాలూ లేక, ఇటు తెలుగుచిత్రాల్లో తనకు నచ్చినపాత్రలు రాక, నిర్మాతలు వెనుకంజ వేయుటంతో, తన భవిష్యత్తు ఏమవుతుందో అనే భయాందోళనల్లో వున్నాడంటున్నారు సినీజనం. తెలుగులో ప్రస్తుతం కాస్త సుమారుగా వెలుగుతున్న ఓ హీరో తనకు దగ్గరి బంధువు కావటంతో, అతని ద్వారా కొన్ని వేషాలు కుదుర్చుకోవాలనుకుంటున్నాడట. ఇంతకూ ఈ పరిస్థితికి కారణం ప్రకాశ్‌రాజ్ ఓవర్‌కాన్ఫిడెన్సేనట!

ఎన్.